చురుగ్గా అభివృద్ధి పనులు

పూల మార్కెట్ రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెలంపల్లి


రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 37వ డివిజన్ పరిధిలోని నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదురు పూలమార్కెట్ వరకూ పూర్తి చేసిన రోడ్డును వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి మంగళవారం ప్రారంభించారు. వెలంపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు డివిజన్లలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయం గేట్ నుంచి పూలమార్కెట్ వరకూ ఉండే రహదారిని రూ.41.25 లక్షలతో సీసీ రోడ్డుగా నిర్మాణం చేశామన్నారు. గత ప్రభుత్వం నగరాభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. డివిజన్‌లో రహదారులతో పాటు పలు పార్కుల పనులు జరుగుతున్నాయని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలు సైతం పూర్తిస్థాయిలో అమలవుతున్నాయని వివరించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగరంలో.. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, పార్టీ నగర అధికార ప్రతినిధి మనోజ్‌కొఠారి, నాయకులు జిలానీ, గ్రంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల పక్షపాతి సీఎం జగన్


వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన మొహిద్దీన్‌ను సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు

వించిపేట(విజయవాడపశ్చిమ): మైనార్టీల సంక్షేమానికి మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం సంతోషకరమని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మెన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం వించిపేట నైజాంగేటు సెంటర్‌లో స్థానిక మైనారిటీ నాయకుడు షేక్ నజీర్ ఆధ్వర్యాన వక్ఫ్ బోర్డ్ చైర్మెన్, డైరెక్టర్ల సన్మాన కార్యక్రమం జరిగింది. మొహిద్దీన్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు, ముస్లిం మైనారిటీలకు గొప్ప మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన మైనార్టీల పక్షపాతి అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ నజీర్, హబీబుల్ల, ఇమామ్ ఖాన్, అహ్మద్, గౌస్ బాషా, బాషా ఖాన్, సల్మా సుల్తానా, షేక్ షబ్బీర్, జబి తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌కు నూతన బస్సు సర్వీసు


నూతన బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న తాతినేని పద్మావతి

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ప్రజా రవాణా సంస్థ విజయవాడ నుంచి మియాపూర్‌కు స్టార్ లైనర్ (నాన్ ఏసీ స్లీపర్ కోచ్) నూతన బస్సు సర్వీసును ప్రారంభించింది. సర్వీస్ నంబర్ 3535 తో నడుపుతున్న ఈ బస్సును మంగళవారం సాయంత్రం విజయవాడ మెయిన్ డిపో నుంచి జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి లాంఛనంగా ప్రారంభించారు. ఈ బస్సు పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి రోజూ రాత్రి 11.15 గంటలకు బయలు దేరి కోదాడ, సూర్యాపేట మీదుగా ప్రయాణించి మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు మియాపూరు చేరుతుంది. తిరిగి ఈ బస్సు సర్వీస్ నంబర్ 3502 తో మియాపూర్‌లో రాత్రి 10 గంటలకు బయలు దేరి ఉదయం 5.30 కు విజయవాడ చేరుకుంటుంది. 30 బెర్తులతో నడిచే ఈ బస్సులో చార్జీలు పై బెర్తుకు రూ. 670, కింది బెర్తుకు రూ. 730 గా నిర్ణయించినట్లు జిల్లా ప్రజా రవాణా శాఖా అధికారి. ఏసుదానం తెలిపారు. కార్యక్రమంలో జోన్–2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ సీటీఎం జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

18న సుబ్రహ్మణ్యేశ్వరుడి కానుకల లెక్కింపు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఇంద్రకీలాద్రిపై కొలువున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 18వ తేదీన భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కిస్తారని తెలిపారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు, ప్రదక్షిణలు చేశారు. వాహన పూజలు జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ నాగినేని భవాని, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

షిరీన్‌బేగంనకు ఘన సత్కారం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల ఐపీఎస్ హోదా పొందిన ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ షిరీన్‌బేగంను మంగళవారం పలువురు ఘనంగా సత్కరించారు. లబ్బీపేటలోని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ షేక్ ఆసిఫ్, జనరల్ మేనేజర్ అంజాద్ అలి, ఇతర అధికారులు సిబ్బంది శాలువా కప్పి పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో చివరిరోజు మంగళవారం స్వామివారికి విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం హోమం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీఎస్ రాజు, కార్యదర్శి శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు, బడేటి ధర్మారావు పర్యవేక్షించారు.

పోషకాహారం తీసుకోవాలి



పటమట(విజయవాడతూర్పు): యువతులు పోషకాహారం తీసుకోవాలని సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రతినిధి డాక్టర్ జాస్మిన్ అన్నారు. స్టెల్లా కళాశాల్లో మంగళవారం పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యాన విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన సదస్సు, వైద్య పరీక్షలు జరిగాయి. ఆమె మాట్లాడుతూ మహిళలు, టీనేజీ యువతుల్లో ఎక్కువగా రక్తహీనత సమస్యలు నమోదవుతున్నాయని, ఎర్రరక్తకణాలు లేకపోవడంతో నీరసం, ఆక్సిజన్ సరఫరా తక్కువగా ఉండటంతో సమస్యలు సంభవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, జి. ఉషాకుమారి, పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు వున్నం స్వప్న, శైలజ, విశాలాక్షి, శారా, శాంతకుమారి, శ్వేత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఉద్యోగ సంఘాల బాసట



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఫుడ్ ప్రాసెసింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఆంబోతు కృష్ణ నాయక్ కుమార్తె హారిక చదువు నిమిత్తం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆర్థిక సాయం ప్రకటించింది. జిల్లా అధ్యక్షులు ఏ విద్యాసాగర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి బాలాజీ నాయక్ సహకారంతో రూ.40వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం విద్యాసాగర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బాలిక తండ్రికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఎన్జీవో నేతలు ఎండీ ఇక్బాల్, శ్రీరామ్, శివ లీల, సంపత్ పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో కేఆర్‌కే డయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన సెంటిని హాస్పిటల్ వైద్యులు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. షుగర్, బీపీ, రక్తశాతం, బ్లడ్ గ్రూపు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.

సమాజానికి 'రోటరీ' విస్తృత సేవలు


వ్యాధిగ్రస్తులకు పాదరక్షలు అందిస్తున్న బాయన బాబూజీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రోటరీ సంస్థ ఆధ్వర్యంలో సమాజానికి విస్తృతమైన సేవలందిస్తున్నామని రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ బాయన బాబూజీ (బాబ్జీ) అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ లెప్రా సొసైటీ సహకారంతో కుష్టు, బోదకాలు వ్యాధిగ్రస్తులకు నగరంలోని కొత్తపేట, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, వైద్య శిబిరం, పాదరక్షలు తదితర వస్తువుల పంపిణీ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. బాబూజీ మాట్లాడుతూ రోటరీ వైద్య రంగానికి సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా పలు సేవలను అందిస్తోందన్నారు. కుష్టు, బోదకాలు వ్యాధిగ్రస్తులకు కలిగే వైకల్యాలను నిరోధించేందుకు పలు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పాదరక్షలు పలు వస్తువులను అందించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు సుంకర నాగభూషణం, శ్రీనివాసరావు, సుబ్బారావు ఏపీ, తెలంగాణ లెప్రా సొసైటీ స్టేట్ కో–ఆర్డినేటర్ మామిడి రాధిక, లెప్రా సొసైటీ ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది . పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యాధరపురానికి చెందిన వక్కలగడ్డ భవాని గొల్లపూడిలోని బాలాజీ ఫార్మాటెక్‌లో పని చేస్తోంది. ఆమె భర్త అఖిల్ కృష్ణవేణి మార్కెట్‌లో సేల్స్‌మేన్‌గా పని చేస్తున్నాడు. వీరిద్దరిది ప్రేమ వివాహం. కొన్నిరోజులుగా భవాని పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో ఈనెల 11వ తేదీ భర్త షాపునకు వెళ్లిన సమయంలో తాను కుట్టు మిషన్ వద్దకు వెళ్లి వస్తానని అత్తమామలతో చెప్పి బ్యాగు సర్దుకుని వెళ్లింది. ఆమె ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అత్తమామలు తమ కుమారుడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. బంధువులు స్నేహితుల ఇళ్ల వెదికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో భవాని భర్త అఖిల్ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భవానీ పనిచేసే షాపు పక్క దుకాణంలోని వ్యక్తికూడా కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సంగీత కచేరీ


వీణపై సంగీత సమితి బాల బాలికల కీర్తనలు

విజయవాడ కల్చరల్: సంగీతమూర్తిత్రయంలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితార్ 257వ జయంతి సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యాన దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. దీక్షితార్ రచించిన సంకీర్తనలను సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, ఎస్ఎస్ కల్యాణరామన్, బీవీ దుర్గాభవాని, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, సద్గురు చరణ్, గండూరి శ్రీనివాస మూర్తి, చిట్టాకార్తీక్, మల్లాది కార్తీక త్రివేణి, లంకా తేజస్విని, సుబ్రహ్మణ్య సంగీత సమితి విద్యార్థులు ఆలపించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సీవీకే ప్రసాద్ మాట్లాడుతూ సంగీత ప్రపంచంలో ముత్తుస్వామి దీక్షితార్, త్యాగరాజ స్వామి, శ్యామశాస్త్రి సంగీత త్రిమూర్తులుగా భావిస్తారన్నారు. సంకీర్తనల ద్వారా భగవంతుని చేరుకోవచ్చునని భావించినట్లు తెలిపారు.

వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి


వైద్య సేవలను ప్రారంభిస్తున్న కృష్ణకుమార్‌ప్రభు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కృష్ణకుమార్ ప్రభు అన్నారు. ఎంజే నాయుడు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ విజయవాడ శాఖ ఆవరణలో మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కృష్ణకుమార్ ప్రభుమాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధునిక జీవనశైలితో ఆరోగ్యాన్ని బలి చేసుకుంటున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఒత్తిడిని జయించాలని సూచించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బంది, హెడ్‌పోస్టాఫీస్, వస్త్రలత సిబ్బంది వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. నరాల సాంద్రత, బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు వంశీకృష్ణ, రవితేజ, సందీప్, ఏజీఎం స్వామి, హెచ్ఆర్ రమణ తదితరులు పాల్గొన్నారు. ఎంజే నాయుడు ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత్‌శర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు.

దివ్యాంగులకు ఉపకార వేతనాల పంపిణీ


దివ్యాంగులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న దాతలు

గుణదల (విజయవాడ తూర్పు) : దృష్టి లోపాలతో ఉన్న విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను వెలికితీసి, వారిని ప్రోత్సహిస్తే ఎంతటి లక్ష్యాలపైనా సాధించగలరని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ అన్నారు. సామర్థ్యాల దినోత్సవం పురస్కరించుకుని లయోల కళాశాల ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల ఉన్నత విద్య విభాగం ఆధ్వర్యంలో దృష్టిలోపం కలిగిన దివ్యాంగులకు పలురకాల పోటీలు, ఉపకారవేతనాల పంపిణీ చేశారు. ఇంద్రియాల ద్వారా వాసన, స్పర్శలతో వస్తువులను గుర్తించే 'గెస్ ది ఐటం' పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రెయిలీ లిపి పఠనం, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కాలేజిలోని ఆడిటోరియంలో హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ (చెన్నై) ఆధ్వర్యంలో 36 మంది దృష్టిలోపం కలిగిన దివ్యాంగులకు రూ.4.05 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్ ట్రస్టీ దీపా కృష్ణమూర్తి ఆన్‌లైన్ ద్వారా దివ్యాంగులను అభినందించారు. సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో మరో 18 మంది దివ్యాంగులకు రూ.3.57 లక్షల స్కాలర్‌షిప్‌లను అందించారు. ట్రస్ట్ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు ఎంఆర్‌కే పరమహంస, రీజనల్ మేనేజర్ పీవీకే శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగుల విద్యాభ్యున్నతికి తమ మద్దతు ఉంటుందని చెప్పారు.

విజయవాడ, గుంటూరులోని పలు కళాశాలల్లోని దృష్టిలోపం కలిగిన దివ్యాంగులకు నిర్వహించిన అరుకమ్మాళ్ మెమోరియల్ ట్రోఫీ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఆంధ్ర లయోల కాలేజి చేజిక్కించుకుంది. కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఫాదర్ అనిల్, ఫాదర్ ప్రభు, కోఆర్డినేటర్ సహాయ భాస్కరన్ పాల్గొన్నారు.

చేతులను శుభ్రంగా ఉంచాలి

- పాఠశాలల్లో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు


విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు వేస్తున్న కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్


జీఎస్ఆర్ హైస్కూల్‌లో మాత్రలు వేస్తున్న రత్నకుమారి


విద్యాధరపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి మాత్ర వేస్తున్న రెహమతున్నీసా


విద్యార్థికి మాత్ర వేస్తున్న ఆంజనేయరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వం అందిస్తున్న ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుంటే ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఆమె విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం మాట్లాడుతూ నులిపురుగులతో రక్తహీనత, ఆకలి మందగించడం, నీరసం కలుగుతుందని, వాటిని నిర్మూలించేందుకు ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఇప్పుడు మాత్ర వేసుకోని విద్యార్థులు ఈ నెల 18న నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసుంధర, పాఠశాల హెచ్‌ఎం వీవీ రవికుమార్, సైకాలజిస్ట్ దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్ జానీ బాషా పాల్గొన్నారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నులి పురుగుల బారిన పడకుండా చేతులు, గోళ్లను శుభ్రం చేసుకుని నులి పురుగుల నివారణ మందులు తీసుకోవాలని సెయింట్ థామస్ ఇంగ్లిషు మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ రాజుడేవిడ్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని కేటీ రోడ్డులోని సెయింట్ థామస్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. పండ్లు కడుక్కొని తినాలన్నారు. మరుగుదొడ్డిని ఉపయోగించిన తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం మాలికాలమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

38వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో

విద్యాధరపురం రావిచెట్టు సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులకు 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి, ఏఎన్ఎం లూసీ రాణి, అంగన్‌వాడీ టీచర్ నజీమున్నీసా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విజేత హైస్కూల్‌లో..

భవానీపురం గాంధీబొమ్మ రోడ్‌లోని విజేత హైస్కూల్‌లో విద్యార్థులకు 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్, ఏఎన్ఎం అనూష పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్యరంగానికి పెద్ద పీట వేశారని కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. వన్‌టౌన్‌లోని 51వ డివిజన్‌లోని నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని తెలప్రోలు రాజాహైస్కూల్, అన్నపూర్ణాదేవి వీఎంసీ హైస్కూల్ ప్రాంగణాల్లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్యక్రమాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజాహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు నాయకులు రామకృష్ణ, ఆనంద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గణితంపై అవగాహన పెంచుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ కె.గంగాధరరావు

గుణదల (విజయవాడ తూర్పు): గణిత శాస్త్రంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధర్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో మూడు రోజులు జరిగే అంతర్జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్రంపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. గణితంలో వస్తున్న మార్పులు గమనిస్తూ ముందుకుసాగాలన్నారు. ఆధునిక ప్రపంచంలో గణిత శాస్త్రంపై ఆదరణ పెరుగుతోందన్నారు. విద్యార్థి దశలోనే గణితాన్ని ఆకళింపచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనోవా విశ్వవిద్యాలయం సీనియర్ డైరెక్టర్ డి. రత్నాకర్, లయోల కళాశాల రెక్టర్ ఫాదర్ బాలశౌరి, ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, గణితశాస్త్ర విభాగాధిపతి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలని, అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధిస్తే లక్ష్యాలు సులభంగా చేరుకోవచ్చని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ గణిత దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణితంలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని, అన్ని శాస్త్రాల్లో గణితం ఇమిడి ఉంటుందన్నారు. కళాశాల గణిత శాస్త్ర విభాగాధిపతి కేవీ నాగలక్ష్మి గణిత శాస్త్ర విశిష్టత వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, సెమినార్ నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల గణిత విభాగం అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సత్వర నేత్ర పరీక్షలతో అంధత్వ నివారణ

పెనమలూరు: సత్వర నేత్ర పరీక్షలు చేయటం వలన గ్లకోమా వల్ల సంభవించే అంధత్వ నివారణ చేయవచ్చని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య శాల కన్సల్టెంట్ డాక్టర్ దీప్తి అన్నారు. తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు తెలిపారు. గ్లకోమా వ్యాధి పరీక్షలు తమ ఆస్పత్రిలో సమర్థవంతంగా నిర్వహించి అంధత్వం నివారణకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 7 గంటలకు అవగాహన కల్పించటానికి వాక్ నిర్వహిస్తామని తెలిపారు.

ఆలయానికి రూ.6.05 లక్షల ఆదాయం



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ ప్రాంగణంలో, సత్రాల్లో టెంట్ సామగ్రి అద్దె హక్కులకు మంగళవారం జరిగిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.6.05 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్ తెలిపారు. ఆలయ బేడా మండపంలో మిగిలిన వేలంకు పాటదారులు రాని కారణంగా వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఈ వైకుంఠరావు, దేవదాయశాఖ నందిగామ డివిజన్ తనిఖీదారు అనురాధ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మరింత వేగంగా స్మృతి వనం పనులు



పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులను మరింత వేగవంతం చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్య మైదాన్‌లో జరుగుతున్న స్మృతివనం, 125 అడుగుల విగ్రహ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. నిర్ణీత గడువు లోపు విగ్రహ నిర్మాణం అన్ని పనులను పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఆయన ఫ్లోరింగ్‌కి వేసిన గ్రానైట్ డిజైన్లను పరిశీలించారు. పర్యటనలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ, కేసీపీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానము
ఇంద్రకీలాద్రి, కొత్తపేట, విజయవాడ-1, NTR జిల్లా. ఫోన్: 7981690322
బహిరంగ వేలం ప్రకటన
ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ 1టౌన్, కొత్తపేటలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానము [illegible] 19-03-2023 నుండి 18-03-2024 వరకు [illegible] 18-03-2023న మధ్యాహ్నము 12.00 గంటలకు [illegible] 10,000/- [illegible]
స్థలము: ఇంద్రకీలాద్రి, కొత్తపేట — సం/- ఎస్.వి. సుబ్బారావు, కార్యనిర్వహణాధికారి
తేదీ: 13-03-2023

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com